www.prajasakti.com
ప్రజాశక్తి
మంగళవారం 6 మే 2025
5
తూర్పుగోదావరి



నేడు ఆర్ట్స్ కళాశాలలో పీజీ గ్రాడ్యుయేషన్ డే

ప్రజాశక్తి-రాజమహేంద్రవరం

ఆర్ట్స్ కళాశాలలో పీజీ గ్రాడ్యుయేషన్ డేను మంగళవారం నిర్వహించనున్నామని ప్రిన్సిపల్ డాక్టర్ ఆర్‌కె.రామచంద్ర తెలిపారు. 2018, 19, 20 సంవత్సరాల విద్యార్థులకు పీజీ డిగ్రీలను అందిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య ప్రసన్నశ్రీ, బిఎంటియు విశ్వవిద్యాలయం, గుజరాత్ ఉపకులపతి ఆచార్య మధుకర్ భాయ్, ఎస్.షుక్ల్ కళాశాల ఉన్నత విద్యాశాఖ డైరెక్టర్ నారాయణ భరత్ గుప్తా, కళాశాల ఉన్నత విద్యాశాఖ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ సిహెచ్.కృష్ణ, సిపిడిసి సెక్రెటరీ తుమ్మిడి రామకుమార్ హాజరు కానున్నారని తెలిపారు. ఆర్ట్స్ కళాశాలలో తొలిసారిగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని ప్రిన్సిపల్ రామచంద్ర ఈ సందర్భంగా తెలిపారు.

ధాన్యం సేకరణ లక్ష్యాలు పెంపు

- తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేస్తాం
- సమీక్షా సమావేశంలో పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి నాదెండ్ల మనోహర్

ప్రజాశక్తి-కాకినాడ ప్రతినిధి

ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో ధాన్యం సేకరణ లక్ష్యాలను పెంచామని మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. కాకినాడ జిల్లాకు 50 వేల టన్నులు బొండాలు రకం, బిఆర్ కోనసీమ జిల్లాకు లక్ష టన్నులు, తూర్పు గోదావరి జిల్లాకు ఇప్పటికే పెంచిన 30 వేలకు అదనంగా మరో 50 వేలు సేకరణ లక్ష్యాలను పెంచామని తెలిపారు. అలాగే అకాల వర్షాల వల్ల తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేస్తామన్నారు. కాకినాడలోని కలెక్టరేట్ వివేకానంద సమావేశ హాల్లో కాకినాడ కలెక్టర్ షాన్‌మోహన్ సగిలి అధ్యక్షతన ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాల జెసిలు, ప్రజాప్రతినిధులు, రైసుమిల్లులతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో మంత్రి నాదెండ్ల మనోహర్ పాల్గొన్నారు. రబీలో ధాన్యం సేకరణలో ఎదురౌతున్న సమస్యలపై ఆయా ప్రజా ప్రతినిధులు, అధికారులు మంత్రికి వివరించారు. అకాల వర్షాల వల్ల పంట నష్టం, రైతులు ఇబ్బందులను సమావేశ దృష్టికి తీసుకొచ్చారు.

కాకినాడ జిల్లాలో ధాన్యం కొనుగోలు ప్రగతిని జాయింట్ కలెక్టర్ రాహుల్ మీనా వివరించారు. ట్రాన్స్ పోర్ట్ కోసం ఉపయోగించే ట్రైలర్ సర్టిఫికేషన్‌కు తీవ్ర జాప్యం జరుగుతోందని ఎంఎల్‌ఎలు తెలిపారు. రవాణా శాఖ అధికారులతో చర్చించి పరిష్కరిస్తామని జెసి తెలిపారు. అకాల వర్షాల వల్ల దెబ్బతిన్న ధాన్యాన్ని మద్దతు ధర ప్రకారం పరిహారం అందించాలని జగ్గంపేట ఎంఎల్‌ఎ జ్యోతుల నెహ్రూ కోరారు. బొండాలు రకం బాయిల్డ్ రైస్ సేకరణకు ఎఫ్‌సిఐ పర్మిషన్ కోసం కోరామని, పర్మిషన్ వచ్చే లోపు కొనుగోళ్లు కొనసాగించాలని పౌర సరఫరాల సంస్థ ఎమ్‌డి డాక్టర్ మనజీర్ జిలానిసామ్యూల్ మిల్లర్లను కోరారు. రైతుల నుంచి ఎంత ధాన్యమైనా కొనడానికి సిద్ధంగా ఉన్నామని మిల్లరు తెలిపారు. ఎఫ్‌సిఐలో మాన్యువల్ గ్రెయిన్ ఎనాలసిస్ వల్ల రిజెక్షన్ ఎక్కువగా ఉంటుందన్నారు. ఆటోమేటిక్ అనాలసిస్ అమలు చేసేలా చూడాలి మిల్లర్లు కోరారు. అలాగే డైలీ టార్గెట్ విధానాన్ని సడలించాలన్నారు.

డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లాలో పంట కోతల సమయంలో తేడాలు ఉన్నందున రైతుసేవా కేంద్రాల లక్ష్యాలను సవరించాలని కొత్తపేట ఎంఎల్‌ఎ బండారు సత్యానందరావు కోరారు. అలాగే గతంలో ఉమ్మడి జిల్లాలో కొనుగోళ్లు నిర్వహించిన ద్వారా సంఘాలకు పెండింగ్ ఉన్న సుమారు రూ.16.75 లక్షల కమిషన్ చెల్లించాలని మండపేట ఎంఎల్‌ఎ వేగుళ్ల జోగేశ్వరరావు కోరారు.

తూర్పుగోదావరి జిల్లాలో మూడు ప్రాజెక్ట్‌ల కింద పంటలు సాగవుతున్నాయని, గోకవరం మండలంలో రైస్ మిల్లులు లేవని, అందువల్ల ప్రత్యేక పరంగా కొనుగోళ్లకు ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని జగ్గంపేట ఎంఎల్‌ఎ జ్యోతుల నెహ్రూ కోరారు. పెదపూడి మండలం రైతుల ధాన్యాన్ని సమీపంలో ఉన్న బిక్కవోలు మండలం రైస్ మిల్లులకు కాకుండా కాకినాడ జిల్లాలోని మిల్లులకు ట్యాగ్ చేయడం వల్ల రైతులు రవాణా సమస్య ఎదుర్కొంటున్నారని అనపర్తి ఎంఎల్‌ఎ నల్లమిల్లి రామకృష్ణారెడ్డి మంత్రి దృష్టికి తెచ్చారు. అలాగే సియంఆర్ బ్యాంకు గ్యారెంటీని 1:1 కాకుండా 1:2 నిష్పత్తికి మార్చాలని అన్ని జిల్లాల మిల్లర్లు కోరారు.

అనంతరం మంత్రి నాదెండ్ల మనోహర్ మాట్లాడుతూ రైతు సంక్షేమమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. ఎన్నడూ లేని విధంగా గడచిన 9 నెలల్లో 49.45 లక్షల మెట్రిక్ టన్నులు ధాన్యాన్ని రైతుల నుంచి కొనుగోలు చేశామన్నారు. రూ.11,400 కోట్లను రూపాయలు రైతుల ఖాతాల్లో 24 గంటల్లో జమ చేశామన్నారు. అకాల వర్షాల వల్ల తడిసిన ధాన్యం అంతా కొనుగోళ్లు చేస్తామన్నారు. ధాన్యం నిమ్ము 22 శాతం వరకు ఉన్నా కొనుగోళ్లు జరపాలని అధికారులకు ఆయన ఆదేశించారు. వర్షాల వల్ల పంటనష్టంపై ఎన్యూమరేషన్ ప్రక్రియ వెంటనే చేపట్టాలని కలెక్టర్లను ఆదేశించామని తెలిపారు. రైతులతో పాటు మిల్లర్ల హితం కూడా ప్రభుత్వం పరిగణలోకి తీసుకుంటుందన్నారు. రైతులకు అండగా నిలిచే ప్రభుత్వ ధృష్టిలో మిల్లర్లు పూర్తి సహకారం అందించాలన్నారు. అన్ని జిల్లాల్లో ఇకపై బ్యాంకు గ్యారంటీని ప్రమాణికంగా 1:2గా అమలు చేస్తామని తెలిపారు. ఈ సమావేశంలో ఎంపీ తంగెళ్ల ఉదయ్‌శ్రీనివాస్, ఎంఎల్‌ఎలు పేరాబత్తుల రాజశేఖరం, ఎంఎల్‌సిలు పంతం నానాజీ, దాట్ల సుబ్బరాజు, వనమాడి కొండబాబు, సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ ఛైర్మన్ తోట సుధీర్, కుడా ఛైర్మన్ తుమ్మల రామస్వామి, బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా జెసి టి.నిశాంతి, తూర్పుగోదావరి జిల్లా జెసి ఎస్.చినరాముడు, మూడు జిల్లాల రైస్ మిల్లర్ల సంఘం అధ్యక్షులు నున్నరామకృష్ణ, కర్రి వెంకటరెడ్డి, సిహెచ్‌వివివిఎస్ఎస్.చౌదరి, పౌర సరఫరాల సంస్థల జిల్లా మేనేజర్లు, పౌరసరఫరాల అధికారులు, మిల్లర్లు పాల్గొన్నారు.



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎల్‌ఐసి నాయకులు

సార్వత్రిక సమ్మె పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

దేశవ్యాప్తంగా ఈ నెల 20న చేపట్టబోయే సార్వత్రిక సమ్మెలో ఎల్‌ఐసి క్లాస్-3, 4 ఉద్యోగులు సుమారు 50 వేల మంది భాగస్వామ్యం అవుతున్నారని ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఎంప్లాయిస్ యూనియన్ రాజమండ్రి డివిజన్ ప్రధాన కార్యదర్శి ఎం.కోదండరామ్ తెలిపారు. ఈ సమ్మెకి సంబంధించిన గోడపత్రికను ఎల్‌ఐసి రాజమండ్రి డివిజనల్ కార్యాలయంలో మధ్యాహ్న భోజన సమయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. నేషనల్ కన్వెన్షన్ ఆఫ్ వర్కర్స్ ఇచ్చిన పిలుపు మేరకు ఎల్‌ఐసిలో అతి పెద్ద సంఘమైన ఆలిండియా ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఎంప్లాయిస్ అసోసియేషన్ ఈ సమ్మెలో పాల్గొంటుందని తెలిపారు. ఇన్సూరెన్స్ రంగానికి సంబంధించిన ముఖ్యమైన అంశాలు కూడా పరిష్కరించాలని కోరుతూ సమ్మెలో పాల్గొంటున్నామని చెప్పారు. బీమా పాలసీలపై జిఎస్‌టి రద్దు చేయాలని, ఎల్‌ఐసిలో ఖాళీగా ఉన్న క్లాస్-3, క్లాస్-4 ఉద్యోగాల భర్తీ వెంటనే చేపట్టాలని, నూతన పెన్షన్ పథకం రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఎల్‌ఐసిలో ఉన్న ఉద్యోగులు అందరికీ 1995 పెన్షన్ పథకం అమలు చేయాలని, కేంద్ర ప్రభుత్వంలో జిఓ 57/03.03.2023లో ఉన్న ప్రొవిజన్స్, ఎల్‌ఐసిలో 1996 రిక్రూట్మెంట్ కోసం వేసిన నోటిఫికేషన్ ద్వారా నియామకం జరిగిన ఉద్యోగులకు వర్తింపజేయాలన్నారు. ప్రభుత్వ రంగ సాధారణ బీమా కంపెనీలను ఒకే కంపెనీగా చేయాలన్నారు. కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలన్నారు. బీమా రంగంలో విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులను నూరు శాతం పెంచడాన్ని వ్యతిరేకిస్తున్నామన్నారు. బీమా చట్ట సవరణలు తగదన్నారు. బీమా రంగంలో ప్రభుత్వ వాటా తగ్గింపు, ఉద్యోగాల ఔట్ సోర్సింగ్, ప్రభుత్వ రంగ సంస్థల ప్రయివేటీకరణ వంటి విధానాలను వ్యతిరేకిస్తున్నామన్నారు. నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని కోరుతూ ఈ దేశవ్యాప్త సమ్మెలో పాల్గొంటున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో యూనియన్ రాజమండ్రి డివిజన్ అధ్యక్షులు మాథ్యూస్, మహిళా కన్వీనర్ శిరీష, ఎస్‌సి, ఎస్‌టి ఒబిసి ఉద్యోగుల సంఘం ప్రధాన కార్యదర్శి విశ్వనాథ్, అధ్యక్షులు బి.శ్రీనివాసరావు, ఇతర నాయకులు సత్యదేవ, జి.శ్రీనివాసరావు, పిఎస్ఎన్. రాజు, రమేష్‌బాబు, రామకృష్ణ, సాయిబాబా, డి.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి

ప్రజాశక్తి - కొవ్వూరు

తమ సమస్యలను పరిష్కరించాలంటూ ఆర్‌టిసి ఉద్యోగులు సోమవారం ఆర్‌డిఒ కార్యాలయంలో వినతిపత్రం అందించారు. నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ కొవ్వూరు డిపో కార్యదర్శి ఎం.శివ మాట్లాడారు. ఆర్‌టిసి ఉద్యోగుల సమస్యలను పరిష్కరించడంలో యాజమాన్యం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందన్నారు. 1-19 సర్క్యులర్‌ను వెంటనే అమలు చేయాలన్నారు. ఆర్‌టిసి కార్మికులకు అందించే వైద్య విధానాన్ని పాత పద్ధతిలోనే అమలు చేయాలన్నారు. సస్పెండ్లు, పనిష్మెంట్లు, తొలగింపులను వెంటనే నిలిపేయాలన్నారు. ఆర్‌టిసి కార్మికుల సమస్యలు పరిష్కరించడంలో డివిజనల్ అధికారి చొరవ తీసుకొని, ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎంయు నాయకులు వివిఎస్‌ఆర్.స్వామి, యజ్జల బాబూరావు, ఇతన సభ్యులు పాల్గొన్నారు.

ఘనంగా మార్క్స్ జయంతి

ప్రజాశక్తి - కొవ్వూరు

ప్రపంచ కార్మికుల విముక్తి కోసం అహర్నిశలు కషి చేసిన మహనీయుడు కార్ల్ మార్క్స్ అని సిపిఎం నాయకులు పడాల గంగాధర్ అన్నారు. కొవ్వూరు సిపిఎం కార్యాలయంలో కార్ల్ మార్క్స్ 207 జయంతిని సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గంగాధర్ మాట్లాడుతూ సమాజంలోని నిమ్న వర్గాలకి, పేదలకు పూర్తి స్వేచ్ఛ స్వాతంత్ర్యం కావాలని పోరాటం చేసిన వ్యక్తి మార్క్స్ అని అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు దగ్గు రాధాకృష్ణ, ఎం.జ్యోతిబసు, కె.ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.




విద్య, వైద్యానికి ప్రాధాన్యత

ప్రజాశక్తి- రాజమహేంద్రవరం ప్రతినిధి

కూటమి ప్రభుత్వం పేదల విద్య, వైద్యానికి అధిక ప్రాధాన్యత ఇస్తుందని రాజమహేంద్రవరం సిటీ ఎంఎల్‌ఎ ఆదిరెడ్డి శ్రీనివాస్ అన్నారు. మరుకుర్తి దుర్గాయాదవ్ జయంతిని పురస్కరించుకుని అతని సోదరులు, టిడిపి నాయకుడు మరుకుర్తి రవి యాదవ్, బిజెపి నాయకుడు మరుకుర్తి నరేష్‌కుమార్‌యాదవ్ ఆధ్వర్యంలో 50వ వార్డులో ఉచిత వైద్య శిబిరాన్ని సోమవారం నిర్వహించారు. దీన్ని ఆదిరెడ్డి వాసు ప్రారంభించారు. ఎంఎల్‌సి సోము వీర్రాజు, మాజీ ఎంఎల్‌సి ఆదిరెడ్డి అప్పారావు, టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గన్ని కృష్ణ, వైసిపి రాష్ట్ర యువజన విభాగం నాయకులు జక్కంపూడి గణేష్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు అంకం గోపి తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎంఎల్‌ఎ వాసు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక వైద్యానికి అధిక ప్రాధాన్యతనిస్తుందన్నారు. మరుకుర్తి సోదరుల సేవలు అభినందనీయమన్నారు. మరుకుర్తి రవి యాదవ్ మాట్లాడుతూ ఏటా తన సోదరుడు మరుకుర్తి దుర్గాయాదవ్ జయంతి రోజున ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేస్తున్నామన్నారు. సహృదయ ఫౌండేషన్, మదర్ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ వైద్యులు వైద్య సేవలు అందించారన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి యర్రా వేణుగోపాలరాయుడు, రాష్ట్ర కార్యదర్శి కాశీ నవీన్‌కుమార్, నక్కెళ్ల బాబూరావుయాదవ్, మదర్ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ ఎమ్‌డి డాక్టర్ రామాఉషాకిరణ్, గండేపూడి సురేష్, మాజీ కార్పొరేటర్ అజ్జరపు వాసు, జనసేన నాయకులు వై.శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

కార్టూ'నిజం'



ఆశాల సమ్మె నోటీసు అందజేత



సమ్మె నోటీసును అందిస్తున్న ఆశావర్కర్లు

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

ఈ నెల 20న దేశావ్యాప్తంగా నిర్వహించే సార్వత్రిక సమ్మెలో తామూ పాల్గొంటున్నామని డిఎంహెచ్ఒ కార్యాలయంలో ఎపి ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా నాయకులు సోమవారం సమ్మె నోటీసును అధికారులకు అందించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి బి.పవన్ మాట్లాడుతూ కేంద్రంలో బిజెపి ప్రభుత్వం కార్మిక చట్టాలను రద్దు చేస్తూ వాటి స్థానంలో తీసుకొస్తున్న 4 లేబర్ కోడ్‌లు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ మే20న దేశ వ్యాప్తంగా కార్మిక వర్గం సమ్మెలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఆశా యూనియన్ జిల్లా కార్యదర్శి వెంకటలక్ష్మి మాట్లాడుతూ ఆశాలను కార్మికులుగా గుర్తించి, కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలన్నారు. కమ్యూనిటీ హెల్త్ వర్కర్స్‌ని ఆశాలుగా మార్పు చేయాలన్నారు. ఈ మేరకు జిఒలు విడుదల చేయాలన్నారు. నియమకాలను ప్రభుత్వమే చేపట్టాలన్నారు. చట్టబద్ధమైన సౌకర్యాలు కల్పించాలనే డిమాండ్ల సాధన కోసం కేంద్ర కార్మిక సంఘాల పిలుపు మేరకు ఈ నెల 20న జరుగుతున్న దేశవ్యాప్త సమ్మెలో ఆశాలు అందరూ పాల్గొంటారని తెలిపారు. ఈ మేరకు జిల్లా వైద్య శాఖ అధికారులకు సమ్మె నోటీసు ఇచ్చామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కె.అన్నామణి, అధ్యక్షురాలు, టి.నాగమణి, జి.బేబీకుమారి, కోశాధికారి టి.అనూష, ఎం.జయమ్మ, కె.నాగమణి, ఎం,కుమారి తడుతరులు పాల్గొన్నారు.

అర్జీదారులు సంతృప్తి పడేలా పరిష్కారం

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం రూరల్



అర్జీదారులతో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రశాంతి

అర్జీదారులు సంతృప్తి చెందాలా అర్జీలకు పరిష్కారం చూపాలని కలెక్టర్ పి.ప్రశాంతి అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో సోమవారం జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పిజిఆర్ఎస్)లో జెసి ఎస్.చిన్నరాముడుతో కలిసి ఆమె ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రజల నుంచి వచ్చిన అర్జీల పరిష్కారంలో నిర్లక్ష్యం వహించ రాదన్నారు. సమస్య పరిష్కారం కాలేదంటూ ప్రజలు తన వద్దకు తిరిగి వస్తే అది సంబంధిత అధికారి నిర్లక్ష్యంగానే పరిగణిస్తామని స్పష్టం చేశారు. కొన్ని సందర్భాల్లో జిల్లా స్థాయి అధికారుల కంటే సచివాలయ ఉద్యోగులు మెరుగ్గా ఎండార్స్‌మెంట్ ఇస్తున్నారని చెప్పారు. సమస్యల పరిష్కారానికి తీసుకున్న చర్యలపై నివేదికను ఎప్పటికప్పుడు సమర్పించాలన్నారు. కింది స్థాయి ఉద్యోగులు ఎలాంటి పరిష్కారం చూపారో చూడాల్సిన బాధ్యత జిల్లా అధికారులపై ఉందన్నారు. పిజిఆర్ఎస్‌కు కొందరు అధికారులు గైర్హాజరవ్వడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. జిల్లా కేంద్రం విడిచి వెళ్లాలి అంటే తప్పని సరిగా అనుమతి తీసుకోవాలని స్పష్టం చేశారు. ఇక నుంచి అందరూ ఈ-ఆఫీస్ ద్వారా సెలవు వివరాలు తెలియచేసి ముందస్తు అనుమతి పొందాలని ఆదేశించారు. సోమవారం రెవెన్యూ 96, పంచాయతీరాజ్ 18, పోలీసు 16, విద్యుత్ శాఖకు సంబంధించి 11, ఇతర శాఖలకు చెందిన 35 అర్జీలు వచ్చాయన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి సీతారామమూర్తి, డిఎస్‌పి భవ్యకిశోర్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు ప్రేమ్ కుమార్, భాగ్యలక్ష్మి, ముఖ్య ప్రణాళిక అధికారి ఎల్.అప్పలకొండ వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు

ఆర్‌ఎస్‌కెలో కలెక్టర్ తనిఖీలు

ప్రజాశక్తి - ఉండ్రాజవరం

మండలంలోని పసలపూడి, వడ్లూరు గ్రామాల్లోని రైతు సేవా కేంద్రాలను కలెక్టర్ పి.ప్రశాంతి, కొవ్వూరు ఆర్‌డిఒ రాణిసుస్మితతో కలిసి సోమవారం తనిఖీలు చేశారు. రైతు సేవా కేంద్రానికి తాళాలు' అంటూ వచ్చిన వార్తలపై ఆమె స్పందించి ఈ తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గతంలో ఎన్నడూ లేని విధంగా రబీలో ధాన్యం సేకరణ చేశామన్నారు. ఆయా ఆర్‌ఎస్‌కెల్లో రిజిస్టర్లు, ఇతర పత్రాలను తనిఖీ చేశారు. ధాన్యం కొనుగోలుకు సంబంధించిన సమస్యలను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆమె మాట్లాడారు. రైతులకు ఇబ్బందులు లేకుండా తగిన చర్యలు తీసుకునేలా ప్రభుత్వానికి తెలియజేస్తామన్నారు. అలాగే చివటంలో స్వామిత్వ సర్వే వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా సర్పంచ్ ఈడుపుగంటి సత్యనారాయణ చెత్త డంపింగ్ యార్డ్ కోసం స్థలం కేటాయించాలని కలెక్టర్ కోరారు. కలెక్టర్ వెంటనే స్పందించారు. అవసరమైన స్థల సేకరణకు చర్యలు తీసుకోవాలని తహశీల్దార్ పిఎన్‌డి.ప్రసాద్‌కు సూచించారు. ఈ కార్యక్రమంలో డిఎల్‌పిఒ, డిపిఒ, ఎంపిడిఒ, ఆయా గ్రామాల కార్యదర్శులు, విఆర్‌ఒలు, ఆర్‌ఎస్‌కెల సిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధి పనులు కల్పించాలని ఎంపిడిఒకు వినతి

ప్రజాశక్తి-కడియం



వినతిపత్రం అందిస్తున్న సర్పంచ్, కూలీలు

తమకు పనులు కల్పించాలంటూ జేగురుపాడు కూలీలు సర్పంచ్ యాదల సతీష్‌చంద్రస్టాలిన్ ఆధ్వర్యంలో ఎంపిడిఒ కె.రమేష్‌కు సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ఇటీవల తమ గ్రామానికి చెందిన ఫీల్డ్ అసిస్టెంట్‌ను సస్పెండు చేసినట్లు తెలిసిందన్నారు. అప్పటి నుంచి తమకు పనులు కల్పించట్లేదన్నారు. ఇటీవల కార్యాలయం నుంచి టెక్నికల్ అసిస్టెంట్ వచ్చి రెండు రోజులు పని చేయించారన్నారు. అయితే ఆన్‌లైన్‌లో హాజరు నమోదు కాలేదని తలిపారు. గతంలో తాము చేసిన పనికి సంబంధించి పేస్లిప్ ఇచ్చేవారన్నారు. దాని వల్ల తాము చేసిన పని దినాలు తెలిసేవన్నారు. ప్రస్తుతం పేస్లిప్‌లు ఇవ్వట్లేదన్నారు. దీని వల్ల తాము నష్టపోతున్నామన్నారు. రెండు నెలల పాటు వేతనాలు ఇవ్వకపోవడం దారుణమన్నారు. వెంటనే తమకు పనులు కల్పించాలని కోరారు.

పలువురికి మాజీ ఎంఎల్ఎ చంటిబాబు పరామర్శ

ప్రజాశక్తి-గోకవరం

మండలంలోని పలువురు వైసిపి నాయకులు మాజీ ఎంఎల్ఎ జ్యోతుల చంటిబాబు సోమవారం పరామర్శించారు. గుమ్మళ్లదొడ్డికి చెందిన వైసిపి ఎస్‌సి సెల్ నియోజకవర్గ అధ్యక్షులు బులా అబ్బులు పాము కాటుకి గురై వద్ద విశ్రాంతి తీసుకుంటున్నారు. ఆయన్ని జ్యోతుల పరామర్శించారు. అలాగే అనారోగ్యానికి గురైన గోకవరానికి చెందిన షేక్ బాబ్జి, పదిలం అప్పారావులను ఇటీవల కాలికి శస్త్రచికిత్స చేయించుకున్న ఎస్‌సి సెల్ మండల అధ్యక్షులు బిజ్జి రాజులను చంటిబాబు పరామర్శించారు. పితృవియోగంతో బాధపడుతున్న సయ్యద్ ఆలీషాను, తుమ్మలపల్లి నాని కుటుంబాలను పరామర్శించారు. కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు. అలాగే మాతృ వియోగానికి గురైన రంపఎర్రంపాలెం గ్రామానికి చెందిన కాళ్ల సత్యనారాయణ కుటుంబాన్ని పరామర్శించారు. ఆయన వెంట దాసరి రమేష్, కర్రి సూరారెడ్డి, బిదిరెడ్డి రాంబాబు, కమ్మిల అచ్చిబాబు, తుమ్మల చిన్నబ్బులు, ఎస్.శ్రీను, బి.వీరచంద్రం తదితరులున్నారు.

సమస్యలు పరిష్కరించాలని ఎపిటిఎఫ్ ధర్నా

ప్రజాశక్తి - కొవ్వూరు

ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని ఎపిటిఎఫ్ ఆధ్వర్యంలో సోమవారం కొవ్వూరు ఆర్‌డిఒ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. అనంతరం ఆర్‌డిఒ కార్యాలయ అధికారి రవివర్మకు వినతిపత్రం అందజేశారు. ఈ ధర్నాకు ముఖ్యఅతిథిగా ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు దుర్గారావు హాజరై మాట్లాడారు. సంస్కరణల పేరుతో విద్యారంగంలో తీసుకొచ్చిన 117 జిఒను వెంటనే రద్దు చేయాలన్నారు. సిపిఎస్, జిపిఎస్‌లను రద్దు చేసి పాత పింఛను విధానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. జిల్లా కార్యదర్శి సనపల రాజశేఖర్ మాట్లాడుతూ 12వ పిఆర్‌సిని నియమించి ఐఆర్ ప్రకటించాలన్నారు. రాష్ట్ర కౌన్సిలర్ సలీం మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న మూడు డిఎలను వెంటనే ఇవ్వాలన్నారు. పిఆర్‌టియు నాయకులు మద్దతు తెలిపారు. సీనియర్ నాయకులు షైక్ జానీ మాట్లాడుతూ తొమ్మిది రకాల పాఠశాలల విధానాన్ని రద్దు చేయాలన్నారు. ఈ ధర్నాలో జిల్లా ఉపాధ్యక్షులు పి.గంగరాజు, మండల ప్రధాన కార్యదర్శి యాదం శంకరం, వివిధ మండలాలకు చెందిన ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యతోనే లక్ష్య సాధన

తాళ్లపూడి : కోరుకున్న లక్ష్యాలను సాధించాలంటే అది విద్య తోనే సాధ్యమని పలువురు వక్తలు అన్నారు. ఇటీవల విడుదలైన ఇంటర్మీడియట్, పదవ తరగతి పరీక్షల్లో ప్రథమ స్థానం పొందిన విద్యార్థులను మలకపల్లి గ్రామంలో సోమవారం దళిత విద్యార్థి సమాఖ్య ఆధ్వర్యంలో మరపట్ల అరుణకుమార్ సత్కరించారు. వారికి ప్రోత్సాహక బహుమతులు, జ్ఞాపికలు అందించారు. అంబేద్కర్ కమ్యూనిటీ హాల్ ఉత్తమ విద్యార్థులకు నిర్వహించిన కెరీర్ గైడెన్స్ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మండల గణాంక అధికారి జోడాల వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ప్రతి విద్యార్థి ఉన్నత స్థానాలు సాధించి తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు పేరు తేవాలన్నారు. విద్యార్థులు ఉన్నత చదువులు చదువుకోవడానికి అన్ని సమయాల్లోనూ తాను సహకారం అందిస్తానన్నారు. ఎస్.మోహన్ మాట్లాడుతూ ప్రతి విద్యార్థి అంబేద్కర్‌ని ఆదర్శంగా తీసుకోవాలన్నారు. డిఎస్ఎఫ్ అధ్యక్షులు ఎన్.చంద్రశేఖర్ మాట్లాడుతూ విద్యార్థుల అవసరాలు తీర్చడానికి అన్ని సమయాల్లోనూ అందుబాటులో ఉంటామన్నారు. రానున్న రోజుల్లో లైబ్రరీ ఏర్పాటు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో డి.హితేష్, కె.అభిషేక్‌వర్మ, డి.రాకేష్, కన్వీనర్లు, అడ్వయిజర్లు, గ్రామస్తులు పాల్గొన్నారు

చిన్నారుల్లో క్రీడా నైపుణ్యాల వెలికితీత

ఎస్‌పి నరసింహకిశోర్

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం



చిన్నారులకు స్పోర్ట్స్ సామగ్రిని అందిస్తున్న ఎస్‌పి నరసింహకిశోర్

చిన్నారుల్లో దాగి ఉన్న క్రీడా నైపుణ్యాన్ని వెలికి తీసేందుకు పోలీస్, చిల్డ్రన్ సమ్మర్ స్పోర్ట్స్ క్యాంపును నిర్వహిస్తున్నామని ఎస్‌పి నరసింహకిశోర్ తెలిపారు. జిల్లా పోలీస్ కార్యాలయంలోని పోలీసు స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో పోలీసుశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ క్యాంపును ఆయన సోమవారం ప్రారంభించి మాట్లాడారు. ఈ సమ్మర్ స్పోర్ట్స్ కోచింగ్ క్యాంపును సద్వినియోగం చేసుకోవాలన్నారు. మే 31వరకూ ఈ క్యాంపు జరుగుతుందన్నారు. ప్రతి రోజూ ఉదయం 6 గంటల నుంచి 8 గంటల వరకు, సాయంత్రం 4 గంటల నుంచి 7 గంటల వరకూ కోచింగ్ ఉంటుందన్నారు. షటిల్, టెన్నిస్, క్రికెట్, వాలీబాల్, యోగాలో శిక్షణ ఇస్తామన్నారు. దీని కోసం ప్రతేకంగా పిఇటిలు, కోచ్‌లను నియమించాలన్నారు. ప్రతి రోజూ క్యాంపునకు హాజరయ్యే చిన్నారులకు రాగి జావ, కోడిగుడ్డు, అరటిపండు వంటి పౌష్టికాహారం ఇవ్వనున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్‌పి(అడ్మిన్) ఎన్‌బిఎం.మురళీకృష్ణ, అడిషనల్ ఎస్‌పి(లా అండ్ ఆర్డర్) ఎవి.సుబ్బరాజు, అడిషనల్ ఎస్‌పి(ఎఆర్) ఎల్.చించిరెడ్డి, డిఎస్‌పి(ఎస్‌బి) బి.రామకృష్ణ, ఇన్‌స్పెక్టర్ (ఎస్‌బి) ఎ.శ్రీనివాసరావు, జోనల్ డిఎస్‌పిలు, సిఐలు, ఆర్‌ఐలు, ఎస్‌ఐలు, పోలీస్ అసోసియేషన్ ప్రెసిడెంట్ ఆర్.రఘురాం, ఇతర అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

పోలీసు పిజిఆర్‌ఎస్‌కు 35 అర్జీలు

రాజమహేంద్రవరం : రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న "ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పిజిఆర్ఎస్) కార్యక్రమాన్ని జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎస్‌పి నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ప్రజల నుంచి 35 అర్జీలను ఆయన స్వీకరించారు. వారి సమస్యను నేరుగా తెలుసుకుని సంబంధిత స్టేషన్ పోలీసు అధికారులతో జూమ్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడారు. ఫిర్యాది దారుల సమస్యలను చట్ట పరిధిలో పరిష్కరించి, సత్వరమే న్యాయం చేయాలని ఉత్తర్వులు ఇచ్చారు. ఈ సందర్భంగా ఎస్‌పి నరసింహకిశోర్ మాట్లాడారు. అర్జీలను నిర్దేశించిన సమయంలో పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్‌పి(అడ్మిన్) ఎన్‌బిఎం.మురళీకృష్ణ, అడిషనల్ ఎస్‌పి(లా అండ్ ఆర్డర్) ఎవి.సుబ్బరాజు, డిఎస్‌పి(ఎస్‌బి) బి.రామకృష్ణ, ఇన్‌స్పెక్టర్(ఎస్‌బి) శ్రీనివాసరావు, ఇన్‌స్పెక్టర్(డిసిఆర్‌బి) పాల్గొన్నారు.

అర్జీదారుల సమస్యలను సత్వరమే పరిష్కరించాలి

ప్రజాశక్తి- కొవ్వూరు

పిజిఆర్‌ఎస్‌లో వచ్చే అర్జీదారుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఆర్‌డిఒ రాణిసుస్మిత అధికారులను ఆదేశించారు. సోమవారం కొవ్వూరు ఆర్‌డిఒ కార్యాలయంలో నిర్వహించిన పిజిఆర్‌ఎస్‌లో ఆమె పాల్గొన్నారు. ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. అర్జీదారుల సమస్య లను సత్వరమే పరిష్కరించడానికి డివిజన్, మండల స్థాయిలో వారానికి రెండు రోజులు అధికారులతో సమావేశాలు నిర్వహిస్తామని తెలిపారు.

నేరాలు ఘోరాలు

గుర్తు తెలియని మృతదేహం స్వాధీనం

ప్రజాశక్తి-గొల్లప్రోలు

పట్టణంలోని 216 జాతీయ రహదారికి సమీపంలోని ఒక పంట కాలువలో గుర్తుతెలియని మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ ఎన్.రామకృష్ణ తెలిపారు. మృతుని వివరాలు తెలియాల్సి ఉందని, కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

గాయపడిన మహిళ మృతి

ప్రజాశక్తి-గొల్లప్రోలు

పట్టణంలోని జాతీయ రహదారి తాటిపర్తి జంక్షన్ వద్ద ఆదివారం రోడ్డు ప్రమాదంలో గాయపడిన ఒక మహిళ చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందింది. ఈ ప్రమాదంలో గాయపడిన మరొకరి పరిస్థితి విషమంగా ఉంది. పోలీసులు బాధితులు తెలిపిన వివరాల ప్రకారం తుని మండలం రాజుపేటకు చెందిన మహిళలు ఒక ఫంక్షన్‌కు ఆటోలో పిఠాపురం మండలంలోని గోర్స వెళుతుండగా ఆటోను ఒక ట్రక్కు ఢీకొని వెళ్లిపోయింది గాయపడిన వారిని వెంటనే కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. సోమవారం తెల్లవారుజామున అరలంక రామలక్ష్మి(48) పరిస్థితి విషమించి మృతి చెందింది. ఈ ప్రమాదంలో ఎనిమిది మందికి గాయాలు అయ్యాయి. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ఎన్.రామకృష్ణ తెలిపారు.

152 మందికి వైద్య పరీక్షలు

ప్రజాశక్తి - ఉండ్రాజవరం

జిసిఎం చర్చి ఆధ్వర్యంలో చివటం గ్రామంలో సోమవారం నిర్వహించిన వైద్య శిబిరంలో 152 మందికి ఏలూరు ఆశ్రమ్ వైద్యులు వైద్య పరీక్షలు నిర్వహించారు. చర్చి నిర్వాహకులు బి.అబ్బులు మాట్లాడుతూ అవసరమైన అందరికీ మందులను ఉచితంగా పంపిణీ చేశామన్నారు. 25 మందిని శస్త్ర చికిత్సలకు రిఫర్ చేసినట్లు జనరల్ మెడిసిన్ డాక్టర్ పి.కృష్ణఘోష్ తెలిపారు. గురువారం వారిని ఆసుపత్రికి చెందిన బస్సులో తీసుకెళ్లి, శస్త్ర చికిత్స అనంతరం తీసుకొస్తామన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ ఘోష్ మాట్లాడుతూ ఈ వైద్య శిబిరంలో ఆర్థో, న్యూరో, జనరల్ మెడిసిన్, గుండె, కంటికి సంబంధించిన వైద్య నిపుణులు తమ సేవలు అందించారన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యులు బి.పవన్‌కుమార్, వి.భావన, శ్రీవల్లి, భరత్, డి.శ్రీనివాసరావు, సిబ్బంది రాజేష్, శిరీష, శ్యాంసాగర్, టి.దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

ప్రకృతి సాగుతో నాణ్యమైన ఉత్పత్తులు

ప్రజాశక్తి - తాళ్లపూడి

ప్రకృతి వ్యవసాయంతో నాణ్యమైన ఉత్పత్తి జరుగుతుందని అధిక లాభాలు వస్తాయని, ప్రజలకు ఆరోగ్యకరమైన పంట ఉత్పత్తులు అందించొచ్చని వేగేశ్వరపురం గ్రామ సర్పంచ్ కొమ్మిరెడ్డి వరకు రామారావు అన్నారు. గ్రామంలో ప్రకృతి వ్యవసాయం చేస్తున్న రైతులు తెలం చంద్రశేఖర్, పెట్ల సుబ్బారావు, తెలం వీరవెంకట సత్యనారాయణలను సోమవారం ఆర్ఎస్‌కె ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ అన్ని పంటలను ప్రకృతి సాగు చేయాలన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి నాగాంజనేయులు, అగ్రికల్చర్ అసిస్టెంట్ వరలక్ష్మి, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

గోదావరి నిషేధిత ప్రాంతాల్లో స్నానాలు ప్రమాదకరం

ప్రజాశక్తి- కొవ్వూరు

వేసవి సెలవులలో విద్యార్థులు స్నేహితులతో కలిసి ఉల్లాసంగా గడిపేందుకు చెరువులు, కాలువలు, గోదావరి నదుల్లో దిగి ప్రమాదాల బారిన పడుతూ ప్రాణాలు కోల్పోతున్నారని, పిల్లల విషయంలో తల్లిదండ్రులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని తహశీల్దార్ డి.దుర్గాప్రసాద్ అన్నారు. సోమవారం కొవ్వూరు తహశీల్దార్ కార్యాలయంలో ఆయన సోమవారం విలేకర్ల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవి తాపాన్ని తగ్గించుకునేందుకు పిల్లలు చెరువులు, కాలువలు, గోదావరి నదిలో దిగుతున్నారన్నారు. ఈత రాక ప్రాణాలు కోల్పోతున్నారని తెలిపారు. చిన్నారులు ప్రాణాలు కోల్పోవడం ఎంతో బాధాకరమన్నారు. ఈ విషయంలో తల్లిదండ్రులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అనుమతులు లేని ప్రదేశాల్లో గోదావరి నదిలో స్నానాలు చేయడం ప్రమాదకరమన్నారు. మండలంలో పలు గోదావరి పరివాహక ప్రాంతాల్లో ప్రమాద హెచ్చరిక ఫ్లెక్సీలు ఏర్పాటు చేశామన్నారు. తల్లిదండ్రులు పిల్లల బంగారు భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని చిన్నారులకు తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.

బాధితులకు త్వరితగతిన న్యాయం

ప్రజాశక్తి - అమలాపురం

బాధితులకు త్వరితగతిన న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని ఎస్పీ బి.కృష్ణారావు ఆదేశించారు. సోమవారం పోలీస్ ప్రధాన కార్యాలయంలో జరిగిన పిజిఆర్ఎస్ కార్యక్రమంలో పలువురు నుంచి అర్జీలను ఆయన స్వీకరించారు. అర్జీదారులతో ముఖాముఖీగా మాట్లాడారు. అనంతరం పోలీస్ అధికారులతో ఆయన మాట్లాడుతూ చట్టపరిధిలో విచారించి ఆయా అర్జీలను త్వరితగతిన పరిష్కరించాలన్నారు. పిజిఆర్ఎస్ ఫిర్యాదులకు ప్రాధాన్యత ఇవ్వాలని, నిర్ణీత గడువులోగా పరిష్కరించి, బాధితులకు త్వరితగతిన న్యాయం చేయాలని, ఆయా ఫిర్యాదులపై తీసుకున్న చర్యలను నిర్ణీత సమయంలో జిల్లా పోలీస్ కార్యాలయానికి నివేదిక రూపంలో పంపించాలని ఆయన ఆదేశించారు. ఈ సందర్భంగా కుటుంబ కలహాలు, భూ వివాదాలు, ఇతర సమస్యలపై 24 మంది ఫిర్యాదుదారులు వారి సమస్యలను ఎస్పీకి వివరించారు.

నాణ్యతా ప్రమాణాలు పాటించాలి

ప్రజాశక్తి - ఆలమూరు

గ్రామాల అభివృద్ధిలో భాగంగా జరుగుతున్న నిర్మాణాల్లో నాణ్యతా ప్రమాణాలు కచ్చితంగా పాటించాలని ఇన్‌చార్జ్ డిఎల్‌పిఒ, ఎంపిడిఒ ఎ.రాజు ఆదేశించారు. సోమవారం మండలంలోని గుమ్మిలేరులో జలజీవన్ మిషన్ ద్వారా రూ.28 లక్షలతో నిర్మిస్తున్న ఓవర్ హెడ్ ట్యాంక్ పనులను ఆర్‌డబ్ల్యుఎస్ ఎఇ పి.పద్మతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జలజీవన్ మిషన్ ద్వారా ఇంటింటా తాగునీరు అందించేందుకు ఓవర్ హెడ్ ట్యాంకులు నిర్మిస్తున్నట్లు తెలిపారు. ఈ నిర్మాణాన్ని త్వరితగతిన పూర్తి చేయడంతోపాటు, నాణ్యత ప్రమాణాలను పాటించాలని కాంట్రాక్టర్లను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

కొనసాగుతున్న సిహెచ్‌ఒల సమ్మె

ప్రజాశక్తి - అమలాపురం రూరల్



ప్లకార్డులతో నిరసన తెలుపుతున్న సిహెచ్‌ఒలు

సమస్యల పరిష్కారం కోసం కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లు చేపట్టిన నిరవధిక సమ్మె సోమవారం నాటికి 8వ రోజుకి చేరింది. కలెక్టరేట్ వద్ద సిహెచ్‌ఒలు మోకాళ్లపై నిలబడి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పలువురు సిహెచ్‌ఒలు మాట్లాడుతూ సమస్యలు చెప్పుకోవడానికి వచ్చిన ఉద్యోగుల పట్ల మంత్రి అనుచితంగా మాట్లాడటం భావ్యం కాదన్నారు. తాము అడుగుతున్న వేతన సవరణ, పెండింగ్ బకాయిలు కాని గొంతెమ్మ కోరికలు కాదన్నారు. 6 సంవత్సరాలుగా ఒక్క రూపాయి వేతనం పెరగక పోగా రెండు సంవత్సరాలుగా ఉన్న బకాయిలు కోసం, ఇన్సెంటివ్స్ విషయంలో ఉన్న అపోహలు తీసివేసి కేవలం సిహెచ్‌ఒలు చేసే పని ఆధారంగానే ప్రోత్సాహకాలు ఇవ్వాలనే డిమాండ్‌తోనే తాము సమ్మె దిగినట్లు తెలిపారు. ఇప్పటికైనా తమ ఆవేదన పట్టించుకుని ప్రజాప్రతినిధులు, అధికారులు తమ సమస్యలను మానవతాదృక్పథంతో పరిష్కరించాలని కోరారు.

సికిల్ సెల్ వ్యాధి నిర్ధారణ పరీక్షలు

ప్రజాశక్తి - కపిలేశ్వరపురం



నిర్ధారణ పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

అంగర ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో సోమవారం సికిల్ సెల్ వ్యాధి నివారణ పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా కపిలేశ్వరపురం, తాతపూడి, అంగర, పడమర ఖండ్రిక, పంచాయతీల పరిధిలో సికిల్ సెల్ రాపిడ్ కిట్ ద్వారా పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ పిఎన్ఎస్‌డి.రత్నకుమారి మాట్లాడుతూ సికిల్ సెల్ వ్యాధి ఒక వంశానుగత రక్త రుగ్మతని అన్నారు. సాధారణంగా మనిషి రక్తంలోని ఎర్రరక్త కణాలు గుండ్రంగా పెప్పెర్‌మింట్ల ఆకారంలో ఉంటాయన్నారు. ఈ కణాలు రక్తనాళాల ద్వారా శరీరమంతా ప్రయాణిస్తూ వివిధ అవయవాలకు ప్రాణవాయువును సరఫరా చేస్తుంటాయని, కొంతమందిలో జన్యుసంబంధ మార్పుల వల్ల ఎర్ర రక్త కణాలు కొడవలి (సికిల్) ఆకారంలోకి మార్పు చెందుతాయని అన్నారు. ఈ సికిల్ సెల్ ఉన్నవారి రక్తకణంలోని ఒక జన్యువు సికిల్ సెల్‌గానూ, ఒకటి మామూలుగానూ ఉన్నట్లయితే అటువంటి వారిని సికిల్ సెల్ క్యారియర్లు అంటారన్నారు. వీరికి మామూలుగా ఎటువంటి ఆరోగ్య సమస్యలు ఉండవని, వివాహం చేసుకున్న దంపతుల ఇద్దరికీ ఇటువంటి లక్షణాలు ఉన్నట్లయితే వారికి పుట్టే పిల్లలకు రక్తకణంలోని రెండు జన్యువులూ వంపు తిరిగి ఉంటాయన్నారు. అటువంటి పిల్లలకు పుట్టుకతోనే ఆరోగ్య సమస్యలు మొదలవుతాయని తెలిపారు. సాధారణ రక్త కణాల జీవిత కాలం 120 రోజులైతే సికిల్ రక్త కణాల జీవిత కాలం 20 నుంచి 25 రోజులు మాత్రమేనని తెలిపాఉ. ఈ వ్యాధి ఉన్న వారు తగిన చికిత్స తీసుకోకపోతే తక్కువ వయసులోనే పది, పదిహేనేళ్ల లోపు చనిపోతారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపిహెచ్‌ఇఒ జె.మల్లికార్జునుడు, హెల్త్ ఎడ్యుకేటర్ బి.రామా రావు, హెల్త్ విజిటర్ టి.మేరీమణి, ల్యాబ్ టెక్నీషియన్ ఎం.అలీ, ఎఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

పారదర్శకంగా అముడా కార్యకలాపాలు

ప్రజాశక్తి - అమలాపురం

జిల్లాలో నూతనంగా ఏర్పడిన అమలాపురం అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ కార్యకలాపాలు అత్యంత సమర్ధవంతంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు బోర్డు కమిటీ సభ్యులు కృషి చేయాలని జాయింట్ కలక్టర్, అముడా ఉపాధ్యక్షులు టి. నిషాంతి సూచించారు. సోమవారం స్థానిక అముడా కార్యాలయంలో అధ్యక్షుడు అల్లాడ స్వామినాయుడు అధ్యక్షతన బోర్డు సభ్యుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా బోర్డు కార్యకలాపాల తీరు, ప్రతిపాదనలపై చర్చించి పలు తీర్మానాలను ఆమోదించారు. ఈ సందర్భంగా ఆమె కార్యనిర్వహక కమిటీ ఏర్పాటు, కమిటీ విధి విధానాలను వివరించారు. అముడా పరిధిలో భవన నిర్మాణ అనుమతులు, ఫీజులు నిర్ణయం, లేఅవుట్లు, భవనాల అనుమతులు కార్యాలయానికి సంబంధించిన అంశాలకు సంబంధించిన ప్రభుత్వ ఉత్తర్వులు, లోగో డిజైనింగ్, పంచాయితీ నుంచి డెవలంప్‌మెంట్ ఛార్జీలు ఆన్‌లైన్‌లో వసూలు చేసే సాఫ్ట్‌వేర్ గురించి, 300 గజాలు పైబడిన అనుమతులన్నింటినీ అముడా పరిధిలోనే ఇచ్చే అంశాలను వివరించారు. ప్రస్తుతం అద్దె భవనంలో అముడా కార్యాలయం కొనసాగుతోందన్నారు. అముడా పరిధిలో మూడు అసెంబ్లీ నియోజకవర్గాలు మాత్రమే ఉన్నాయని మిగిలినవి, రుడా పరిధిలో ఉన్నాయని జిల్లా అంతటిని యూనిట్‌గా చేసేలా అముడా పరిధిలోకి తీసుకురావడానికి ప్రతిపాదించామన్నారు. అముడా పరిధిలో ఇంజనీరింగ్, ఎస్టేట్ వింగ్ అకౌంటింగ్ విభాగాలను ఏర్పాటుకు ప్రభుత్వం ద్వారా ఏర్పాటుకు బోర్డు ప్రతిపాదించిందన్నారు. ఈ కార్యక్రమంలో అమ్ముడా ఛైర్మన్ స్వామినాయుడు మాట్లాడుతూ అముడా అభివృద్ధికి సభ్యులందరు సమన్వయంతో పని చేయాలని, ఆయా విభాగాలకు సంబంధించిన సూచనలు, సలహాలు ఇవ్వాలని కోరారు. ఈ సమావేశంలో బోర్డు సభ్యులు ట్రాన్స్‌కో ఎఇ ఎస్.రాజబాబు, జిల్లా కాలుష్య నియంత్రణ మండలి ఇఇ శంకర్‌రావు, ఆర్ అండ్ బి ఎస్‌ఇ బి.రాము, జిల్లా పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజర్ పికెపి. ప్రసాద్, ప్లానింగ్ అధికారి ఎ.సత్యమూర్తి తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి కోసం మహిళల వినతి

ప్రజాశక్తి - ఆలమూరు

ఆలమూరులో నాయి బ్రాహ్మణ వీధికి చెందిన పలువురు మహిళలు తాగునీటి సమస్యపై పిజిఆర్ఎస్ కార్యక్రమంలో ఫిర్యాదు చేశారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన పిజిఆర్ఎస్ కార్యక్రమంలో ఎంపిడిఒ ఎ.రాజు, తహశీల్దార్ కెజె.ప్రకాష్‌బాబుకు వినతులను స్వీకరించారు. ఈ సందర్భంగా నాయి బ్రాహ్మణ వీధికి చెందిన మహిళగడిచిన మూడేళ్లుగా తమ ప్రాంతంలో చేతి పంపు పని చేయడం లేదని, పంచాయతీ నుంచి తాగునీరు సరఫరా కావడం లేదని, ఇప్పటికే పలు దఫాలుగా పంచాయతీ అధికారులకు ఫిర్యాదు చేసిన పట్టించుకోవడం లేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ రాజు మాట్లాడుతూ సమస్యను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కార్యాలయ ఎఒ మెహర్‌ప్రకాష్, ఆర్‌డబ్ల్యుఎస్ ఎఇ పి.పద్మ, వ్యవసాయ శాఖ అధికారి ఎఒ ఎస్.లక్ష్మీలావణ్య, ఎపిఒ అరుణకుమారి, ఎపిఎం ధనరాజు, తదితరులు పాల్గొన్నారు.

చెత్తను కాలువలో వేయించిన యజమానికి జరిమానా

ప్రజాశక్తి - అమలాపురం

మున్సిపాలిటీ పరిధిలోని కలశం సెంటర్‌లోని చిన వంతెనపై నుంచి కాలువలోకి చెత్తను వేయించిన హోటల్ యజమానికి మున్సిపల్ అధికారులు రూ.2 వేలు జరిమానా విధించారు. సోమవారం మున్సిపల్ కార్యదర్శులు బండి వీరన్న, ఆకుల కుమారస్వామి వ్యాపార దుకాణాలు, హోటల్స్, బేకరీలపై ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో వివిధ దుకాణం దారులకు రూ.8000 జరిమానా విధించి, మరలా ప్లాస్టిక్ వస్తువులు వినియోగించిన, చెత్తను రోడ్లు, కాలువలో వేసినా ఆయా వ్యాపార సంస్థలను మూసివేస్తామని హెచ్చరించారు. కలశం సెంటర్‌లోనీ మారుతీ బెంగుళూరు బేకరిని తనిఖీ చేసి 8 కేజీల పాలిథిన్ కవర్లను సీజ్ చేసి, యజమాని జిఆర్.మధుకు రూ.5000 జరిమానా విధించారు. అలాగే గణపతి థియేటర్ వద్ద కనక దుర్గ టిఫిన్స్ సెంటర్ యజమానికి చెందిన హోటల్‌లో చెత్తను కలశం సెంటర్‌లో కాలువలో పడవేస్తుండగా అధికారులు గుర్తించి యజమానికి రూ.2 వేలు జరిమానా విధించారు. అలాగే మనోజ్ వైన్స్‌లో ప్లాస్టిక్ గ్లాసులు వినియోగిస్తున్నట్లు గుర్తించిన అధికారులు యజమాని జి.చిరంజీవికి రూ.1000 జరిమానా విధించారు. ఈ తనిఖీల్లో శానిటేషన్ మేస్త్రీలు ఎం.రాజు, ఎం.నవీన్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

చలివేంద్రాన్ని ప్రారంభించిన ఎంఎల్‌ఎ

ప్రజాశక్తి - మండపేట

చాంబర్ ఆఫ్ కామర్స్ ఆధ్వర్యంలో స్థానికంగా సోమవారం ప్రియా లాడ్జి వద్ద ఏర్పాటుచేసిన చలివేంద్రాన్ని రాష్ట్ర అంచనాల కమిటీ ఛైర్మన్, ఎంఎల్‌ఎ వేగుళ్ళ జోగేశ్వరరావు ప్రారంభించారు. అలాగే సంతమార్కెట్ వద్ద చలివేంద్రాన్ని మున్సిపల్ మాజీ ఛైర్మన్ చుండ్రు శ్రీవరప్రకాష్, కొండపల్లి రామాలయం వద్ద చలివేంద్రాన్ని యువ నాయకులు వి.సాయికుమార్‌బాబు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షులు కాళ్ళకూరి గొల్లబాబు, సెక్రటరీ బొబ్బా రామకృష్ణ, టిడిపి నాయకులు మల్లిపూడి గణేశ్వరరావు, కాళ్లకూరి శ్రీనివాస్, వాకచర్ల గుప్తా, తదితరులు పాల్గొన్నారు.

మందపల్లిలో చలివేంద్రం ప్రారంభం

ప్రజాశక్తి - కొత్తపేట

మండుతున్న ఎండలతో ఇబ్బందులు పడుతున్న బాటసారుల దాహం తీర్చేందుకు చలివేంద్రం ఏర్పాటు చేయడం అభినందనీయమని ఎంఎల్‌ఎ బండారు సత్యానందరావు అన్నారు. సోమవారం మండలంలోని మందపల్లిలో మందేశ్వర స్వామి దేవస్థానం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఉప సహాయక కమిషనర్ నల్లం సూర్యచక్రధర్‌రావు, మాజీ జడ్‌పిటిసి ధర్నాల రామకృష్ణ, ఎంపిటిసి సభ్యులు సిద్దిశెట్టి వీరవెంకట సత్యనారాయణ, గ్రామ పెద్దలు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఉగ్ర దాడిని నిరసిస్తూ చిన్నారుల ప్రార్థనలు

ప్రజాశక్తి - ఆత్రేయపురం

మండలంలోని ర్యాలీ గ్రామానికి చెందిన శ్యామ్ జాదూగర్ మాయా ఈ బడి ఆధ్వర్యంలో సోమవారం స్థానిక అనూస్ హోంలో చిన్నారుల ప్రపంచ శాంతి సదస్సు జరిగింది. ఈ సందర్భంగా హిందూ, ముస్లిం, క్రైస్తవ చిన్నారులు పహల్గామ్‌లో ఉగ్రవాదుల దాడిని తీవ్రంగా ఖండించారు. తొలుత స్థానిక గాంధీ సెంటర్లో గాంధీ విగ్రహానికి చిన్నారులు పుష్పాలు వేసి నివాళులర్పించారు. అనంతరం ప్రపంచ శాంతిని కోరుతూ ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వాహకుడు శ్యామ్ మాట్లాడుతూ చిన్నారుల్లో దేశభక్తిని రగిలించేలా గత 30 సంవత్సరాలుగా గాంధీ వచ్చిన వేళ అనే కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

అన్నదాన భవన నిర్మాణానికి రూ.లక్ష విరాళం

ప్రజాశక్తి - ఆత్రేయపురం

వాడపల్లి వెంకటేశ్వర స్వామి ఆలయం శ్రీనివాస ప్రాంగణంలో నిర్మిస్తున్న వకుళ మాత అన్నదాన భవన నిర్మాణానికి సోమవారం కొత్తపేటకు చెందిన తురగా సత్యనారాయణ మూర్తి, తురగా గోపాలకృష్ణమూర్తి కుటుంబ సభ్యులు లక్ష ఐదు రూపాయలను ఆలయ డిసి నల్లం సూర్యచక్రధరావుకు అందజేశారు.

విద్యార్థులను అభినందించిన ఎంఎల్‌ఎ

ప్రజాశక్తి - కొత్తపేట

మండలంలోని వాడపాలెం హైస్కూల్‌లో 10వ తరగతిలో ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులను ఎంఎల్‌ఎ బండారు సత్యానందరావు అభినందించారు. 569 మార్కులు సాధించి ప్రథమ స్థానంలో నిలిచిన నరెడ్ల హారిక, ద్వితీయ స్థానంలో నిలిచిన బండారు యశ్వంతి, 500పైగా మార్కులు సాధించిన మనీషా, జ్యోత్స్న, సౌమ్య, పూజ, అశ్వినిదీప్తిలను ఆయన సోమవారం అభినందించారు. భవిష్యత్‌లో మరింతగా రాణించి ఉన్నతస్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో హైస్కూల్ హెచ్‌ఎం వై.చంద్రశేఖరం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పంట బోదెల రక్షణకు చర్యలు

ప్రజాశక్తి - ఆలమూరు

గ్రామాల్లో డ్రెయినేజీ వ్యర్థాలు పంట బోదెల్లో కలవకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఎంపిడిఒ, ఇన్‌ఛార్జ్ డిఎల్‌పిఒ ఎ.రాజు ఆదేశించారు. సోమవారం మండలంలోని పెద్దపళ్ళ పంచాయతీ పరిధిలోని చింతలూరు సాగునీటి సంఘం అధ్యక్షుడు, రాష్ట్ర హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ వైస్ ఛైర్మన్ గారపాటి శ్రీనివాసరావుతో కలిసి ఆయన పంటబోదెలను పరిశీలించారు. పంటబోదెలు అస్తవ్యస్తంగా, చెత్తతో ఉండటంతో ఇలా అయితే దిగువకు నీటి ప్రవాహం ఎలా వెళ్తుందని పంచాయతీ కార్యదర్శిని నిలదీశారు. పంట బోదెలను పరిశుభ్రం చేయడం ద్వారా సాగునీటి ప్రవాహానికి అడ్డంకులు లేకుండా చర్యలు తీసుకోవాలని ఆయన ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ సత్యశ్రీ మెహర్‌ప్రసాద్, పంచాయతీ కార్యదర్శి వి.వేణి, విఆర్‌ఒ ఉదయ్‌కుమార్, పంచాయతీ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

మద్దతు ధర కోసం ధర్నా

ప్రజాశక్తి - కె.గంగవరం

రైతు పండించిన ధాన్యాన్ని మద్దతు ధరకు కొనుగోలు చేయాలని రైతు-కూలీ సంఘం ఆధ్వర్యంలో రైతులు ధర్నా నిర్వహించారు. సోమవారం స్థానిక మండల రెవెన్యూ కార్యాలయం వద్ద జరిగిన ధర్నాలో సిపిఐఎంఎల్(న్యూడెమోక్రసీ) నాయకుడు చీకట్ల వెంకటేశ్వరరావు మాట్లాడారు. రైతు పండించిన ప్రతీ గింజను ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని ప్రజాప్రతినిధులు ప్రకటనలు చేస్తున్నారని, కానీ ఆచరణలో ఎక్కడా అమలు కావడం లేదన్నారు. ఆర్ఎస్‌కెల ద్వారా ధాన్యాన్ని కొనుగోలు చేయకపోవడంతో రైతులు దళారులను ఆశ్రయించాల్సి వస్తుందని అన్నారు తక్షణమే ప్రభుత్వం రైతు వద్ద ఉన్న ధాన్యానికి మద్దతు ధర ఇచ్చి కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం తహశీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. అలాగే వ్యవసాయ శాఖ కార్యాలయంలో ఎఒకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు బి.సిద్ధు, చింతా రాజారెడ్డి, రైతులు వట్టికూటి జానకి రామయ్య, నేమాని సాయి, గరికపాటి రామకృష్ణ, వినకోటి సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

ఎంఎల్‌ఎకు కృతజ్ఞతలు తెలిపిన టిడిపి శ్రేణులు

ప్రజాశక్తి - ఆలమూరు

మడికి గ్రామ అభివృద్ధికి కృషి చేస్తున్న ఎంఎల్‌ఎ బండారు సత్యానందరావును మడికి గ్రామ టిడిపి శ్రేణులు కృతజ్ఞతలు తెలిపారు. సోమవారం టిడిపి గ్రామ కమిటీ అధ్యక్షుడు దొండపాటి సుబ్బరాజు ఆధ్వర్యంలో పార్టీ శ్రేణులు ఎంఎల్‌ఎ క్యాంపు కార్యాలయంలో ఆయనను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భ:గా ఆయనను పూలమాలలతో సత్కరించారు. గ్రామంలో అధ్వానంగా ఉన్న రోడ్ల దుస్థితిని ఎంఎల్‌ఎకు వివరించడంతో వెంటనే స్పందించి సుమారు రూ.1.14 కోట్ల నిధులు మంజూరు చేయించారన్నారు. అందుకు కృతజ్ఞతగా ఎంఎల్‌ఎను కలిసి కృతజ్ఞతతో సత్కరించినట్లు స్థానిక విలేకరులకు సుబ్బరాజు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఉప సర్పంచ్ పాలూరి బుల్లబ్బాయి, నాయకులు చెల్లబోయిన సింహాచలం, అడ్డాల రాజు, పంపన అంజిబాబు, ఈదల రమేష్, కొత్తపల్లి కృష్ణ, మల్యాల రాజేష్, తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా ఇఎపి సెట్ నిర్వహణకు చర్యలు

ప్రజాశక్తి - అమలాపురం



సమావేశంలో మాట్లాడుతున్న డిఆర్‌ఒ రాజకుమారి

ఈ నెల 6, 7 తేదీల్లో ఎపి ఇంజనీరింగ్ కామన్ ఎంట్రన్స్ టెస్ట్ పరీక్షలు - 2025 స్థానిక శ్రీనివాస, బివిసి ఇంజనీరింగ్ కళాశాలల్లో ప్రశాంత వాతావరణంలో నిర్వ హించాలని డిఆర్‌ఒ బిఎల్ఎన్.రాజకుమారి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్లో ఇఎపి పరీక్షల సన్నద్ధతపై ఆమె అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పాలిటెక్నిక్ డిప్లమో విద్యాభ్యాసం పూర్తిచేసిన విద్యార్థులు ఈ కామన్ ప్రవేశ పరీక్షకు అర్హులని అన్నారు. జిల్లాలో సుమారు 800 మంది ఈ పరీక్షకు హాజరు కానున్నారన్నారు. ఈ ప్రవేశ పరీక్ష అర్హత సాధించిన వారు నేరుగా ఇంజనీరింగ్ 2వ సంవత్సరంలో ప్రవేశం పొందవచ్చునన్నారు. ఈ ప్రవేశ పరీక్ష నిర్వహణకు రెండు పరీక్షా కేంద్రాలను కాట్రేనికోన మండలం చెయ్యేరు శ్రీనివాస ఇంజనీరింగ్ కాలేజ్, స్థానిక భట్లపాలెం బివిసి ఇంజనీరింగ్ కళాశాలలో ఎంపిక చేసినట్లు ఆమె తెలిపారు. ఈ ప్రవేశ పరీక్షను రెండు ఇంజనీరింగ్ కళాశాలలో ఉదయం 9 గంటల నుంచి 12 గంటల వరకు మధ్యాహ్నం రెండు గంటల నుంచి 5 గంటల వరకు రెండు బ్యాచ్లుగా నిర్వహిస్తారని తెలిపారు. రెండు పరీక్షా కేంద్రాలలో రెండు బ్యాచులకు రోజుకు 400 చొప్పున రెండు రోజులలో 800 మంది పరీక్షలకు హాజరు కానున్నారన్నారు. పరీక్షా కేంద్రాల వద్ద శాంతి భద్రతల పరిరక్షణ, తాగునీటి వసతి కల్పించడం, నిరంతరాయంగా విద్యుత్ సరఫరా ఉండేలా చర్యలు తీసుకోవడంతోపాటు, మెడికల్ క్యాంపును ఏర్పాటు చేయాలన్నారు. పరీక్షా కేంద్రాలకు ఆర్‌టిసి బస్సులను అభ్యర్థుల రాకపోకల సౌకర్యార్థం ఆయా రూట్లలో ఏర్పాటు చేయాలన్నారు. ఈ సమావేశంలో డిపిఒ శాంతలక్ష్మి, మున్సిపల్ కమిషనర్ కెవిఆర్.రాజు అసిస్టెంట్ ప్రొఫెసర్లు రామకృష్ణరాజు, ఎ.కుమార్, జెఎన్‌టియుకె పరిశీలకులు విజయకుమారి, తదితరులు పాల్గొన్నారు.

వ్యాధి నిరోధక టీకాలపై అవగాహన

ప్రజాశక్తి - రామచంద్రపురం

మండలంలోని ద్రాక్షారామ, వెల్ల పిహెచ్‌సిలలో వ్యాధి నిరోధక టీకాలపై ఎఎన్ఎంలకు అవగాహన సదస్సును సోమవారం నిర్వహించారు. ఈ సదస్సులో జిల్లా వ్యాక్సిన్ మేనేజర్ సునీల్, వైద్య ఆరోగ్య శాఖ సబ్ డివిజన్ అధికారి డాక్టర్ ఎన్.ప్రశాంతి మాట్లాడారు. గర్భిణులు, అప్పుడే పుట్టిన బిడ్డ నుంచి ఐదేళ్ల పిల్లలకు వ్యాధులు రాకుండా వ్యాధి నిరోధక టీకాలు నిర్ణయించిన కాలంలో తప్పకుండా వేయాలన్నారు. వాటి వివరాలను యువిన్ పోర్టల్‌లో నమోదు చేయాలని అన్నారు. యు విన్ పోర్టల్‌లో వాక్సినేషన్ వివరాలు నమోదు చేయడం వలన వ్యాక్సిన్ సర్టిఫికెట్ పొందవచ్చునని తెలిపారు. కొత్తగా వ్యాక్సిన్ సైట్ ఎలా క్రియేట్ చేయాలి, డ్యూలిస్ట్ ఎలా క్లియర్ చేయాలి, మొబైల్ నెంబర్‌తో వాక్సిన్ పొందిన వారిని ఎలా ఎంటర్ చేయాలి అంశాలపై శిక్షణ ఇచ్చామని జి.కమల్ శేషు తెలిపారు. ఈ కార్యక్రమంలో డిపిఎంఒ వెంకటేశ్వరరావు, సిహెచ్‌ఒ వీరవేణి, సూపర్‌వైజర్లు సిహెచ్.సూర్యారావు, కె.శ్రీనివాస్, రత్నం, జానకమ్మ, వరలక్ష్మి పాల్గొన్నారు.

పుస్తక పఠనంతో ఉన్నత లక్ష్యాలు

ప్రజాశక్తి - ఆత్రేయపురం

విద్యార్థులు పుస్తక పఠనం ద్వారా ఉన్నత లక్ష్యాలను సాధించాలని విశ్రాంత ఉపాధ్యాయులు కె.రత్నంరాజు అన్నారు. వేసవి విజ్ఞాన తరగతులు 7వ రోజు కార్యక్రమంలో భాగంగా ఆయన విద్యార్థులకు పుస్తక పఠనంపై వివరించారు. వివిధ పాఠశాల విద్యార్థులు ఉత్సాహంగా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.. గ్రంథాలయ అధికారి టి.నమశ్శివాయ జనరల్ నాలెడ్జ్ అంశాలు భాగంగా ప్రపంచ పటంలోని దేశాలు, ఖండాల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో 150 మంది విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులతో ఆరోగ్యం

ప్రజాశక్తి - మామిడికుదురు

ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులను వినియోగించడంతో సంపూర్ణ ఆరోగ్యాన్ని పొందవచ్చని అనంతపురం మోడల్ మేకర్ ట్రైనీ ఓబులేసు అన్నారు. సోమవారం ప్రభుత్వ కార్యాలయాల వద్ద ప్రతి సోమవారం ఏర్పాటు చేసిన ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తుల విక్రయశాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయం ద్వారా పండించిన ఉత్పత్తులను చాలామంది వినియోగిస్తున్నారని అన్నారు. ప్రభుత్వం ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించేందుకు కృషి చేస్తుందన్నారు. ఈ సందర్భంగా కూటమి నాయకులు ఈలి శ్రీనివాసరావు, వర్ధినేని వెంకట్రామయ్య, సాపే ఏకాశి ఉత్పత్తుల స్టాల్‌ను సందర్శించారు. ఈ కార్యక్రమంలో మహిళా రైతులు కుడుపూడి జానకి, చెల్లిబోయిన రాధ,పసుమ పద్మావతి, లెనిన్‌బాబు పాల్గొన్నారు.

లింక్ డాక్యుమెంట్లు పోయినవి

కాకినాడ జిల్లా, ఏలేశ్వరం మండలం, ఏలేశ్వరం గ్రామానికి చెందిన సప్పా సత్యవేణి, భర్త: శ్రీనివాస్ నాకు చెందిన రాజమండ్రి రూరల్ హుకుంపేట సావిత్రి నగర్ లేఅవుట్ LP.No. 54/1985 నందు గల చ॥గ॥ 109.25 లు ఇంటి స్థలమునకు చెందిన నెం. 3244/2021, తేదీ: 08-07-2021 లింక్ డాక్యుమెంట్ ఏలేశ్వరంలోని మా ఇల్లు రిపేర్ నిమిత్తం 09-10-2024వ తేదీన సామాన్లు మారుస్తుండగా పోయినది. ఎవరికైనా దొరికినచో ఈక్రింది అడ్రస్‌కు తెలియజేయగలరు.

సప్పా సత్యవేణి, భర్త: శ్రీనివాస్
డోర్ నెం. 14-11-101, మేకల కబేళా రోడ్డు
ఏలేశ్వరం, కాకినాడ జిల్లా - 533429
సెల్: 9281459889

CHANGE OF NAME

I, **VADLAPATI THERESA** (NEW NAME), D/o VADLAPATI SREENIVAS, previously called VADLAPATI TERISSA (Old Name), Resident of Door No. 6-249, Sankaraguptam Village, Malikipuram Mandal, Dr. B.R.Ambedkar Konaseema Dist., Pin 533250. Now Changed My Name from **VADLAPATI TERISSA** (Old Name) To **VADLAPATI THERESA** (New Name). Hence forth I will be called as **VADLAPATI THERESA** (New Name) for all purpose.

ప్రకటన

మహారాజశ్రీ సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో: పిఠాపురం

I.A. 609/2023; O.S. 136/2017

Between:

గంపల అమ్మాజీ ...పిటీషనర్ / వాది

మరియు

కోట అర్జున్న మరియు ఇతరులు

...రెస్పాండెంట్స్ / 1, 2 ప్రతివాదులు / 3 నుండి 5 ప్రతివాదులుగా చేర్చవలసినవారు

రెస్పాండెంట్ నెం. 5 :

5 : **శ్రీమతి రాయుడు మణెమ్మ,** భర్త: నాగేశ్వరరావు, తండ్రి: కోట పెద అప్పారావు, వయస్సు 80 సం॥లు, హిందూ, గృహిణి, కొత్తమూలపేట, యు.కొత్తపల్లి మండలం.

పై ఐ.ఎ. లో 5వ రెస్పాండెంటు అయిన మీకు, మీ హాజరు నిమిత్తం శ్రీ కోర్టువారు **ది. 09-05-2025 తేదీకి** వాయిదా వేసియున్నారు. కావున సదరు పై ఐ.ఎ. లో మీరు స్వయముగా లేదా న్యాయవాదుల ద్వారా పై కోర్టువారి ఎదుట **ది. 09-05-2025వ సం॥రం తేదీని ఉదయం గం. 10-30 ని॥లకు** హాజరై మీ ఆక్షేపణలు తెలియజేసుకొనవలెను. లేనిచో మీ పరోక్షమున తీర్మానించబడును.

వాయిదా : 09-05-2025

మేరుగు రాజారావు, సి.హెచ్. రమణి
అడ్వకేట్స్, పిఠాపురం.
పిఠాపురం.
ది.05-05-2025 సెల్: 9440522671

ఒరిజినల్ లింక్ డాక్యుమెంట్లు పోయినవి

తూర్పుగోదావరి జిల్లా, నల్లజర్ల మండలం, తెలికిచెర్ల గ్రామ పంచాయతీ పరిధిలో గల పదిలం పెద్దిరాజు, తండ్రి: సత్యనారాయణ కు గల రీ సర్వే నెం. 303/3లో 242 చదరపు గజాలకు చెందిన నెం. 3279/2021 గల ఒరిజినల్ లింకు డాక్యుమెంట్, ది. 21-04-2025వ తేదీన ఫోటో స్టార్ట్ నిమిత్తం తెలికిచెర్ల గ్రామం నుండి అనంతపల్లి మోటార్ సైకిల్‌పై వెళుతూ ఉండగా సదరు డాక్యుమెంట్ కలిగిన కవరు మార్గమధ్యంలో పడిపోయింది. దొరికిన వారు ఈ క్రింది అడ్రస్‌కు తెలియజేయగలరు.

అడ్రస్:
పదిలం పెద్దిరాజు, తండ్రి: సత్యనారాయణ
కమతం కుంట. తెలికిచెర్ల గ్రామం
నల్లజర్ల మండలం. తూర్పుగోదావరి జిల్లా.
ఆంధ్రప్రదేశ్, ఫోన్ నెంబర్.9346429005

మహారాజశ్రీ 1వ అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టు, రాజమహేంద్రవరం

O.S. 402/2024

Between:

Union Bank of India, T.Nagar Branch, Rajahmundry, rep. by its Branch Manager -వాది

మరియు

మలిసెట్టి సతీష్‌కుమార్ అండ్ అనదర్ -ప్రతివాదులు

To:

D-1: మలిసెట్టి సతీష్‌కుమార్, S/o. హనుమాజీ, డో.నెం. 39-17-50/5, తారకరామ నగర్, మోరంపూడి, రాజమండ్రి.

D-2: చింతా కనకదుర్గా వరప్రసాద్, S/o. ధర్మారావు, డో.నెం. 36-29-17, పాత రామాలయం వీధి, కోటిపల్లి బస్టాండు వెనుక, రాజమండ్రి.

-1, 2 ప్రతివాదులు

నోటీసు

పై దావాలో శ్రీ కోర్టు వారు మీకు ఎన్నిమార్లు నోటీసులు పంపినను తీసుకోని కారణంగా సదరు నోటీసు పేపరులో ప్రచురించుటకు ఉత్తర్వులు జారీ చేసియున్నారు. దాని ప్రకారం పై దావా మీకు నోటీసు నిమిత్తం **ది. 12-5-2025వ తేదీకు** వాయిదా అయి వున్నదని మీకు యిందుమూలముగా తెలియ చేయడమైనది. కావున సదరు వాయిదా రోజు **ఉదయం 10.30 ని॥లకు** మీరు యిరువురు కోర్టు వారి ఎదుట స్వయంగా గాని, వకీలు ద్వారా గాని హాజరు అయి మీ ఆక్షేపణలు తెలియచేసుకోవలసినదిగా యిందుమూలముగా మీకు తెలియచేయడమైనది.

క్రొవ్విడి వెంకటరావు
రాజమండ్రి వాది తరపు న్యాయవాది
03-5-25 సెల్: 9440254625

In the Court of the Hon'ble Junior Civil Judge, Pithapuram

I.A. 241/2024 in **O.S. No. 258/2021**

Between:

1. Kuppili Radha, W/o. late Baburao
2. Kuppili Mohana Krishna Chaitanya Reddy @ Kuppili Chaitanya, S/o. late Baburao

...Petitioners/ Plaittiffs

AND

Kumar Beg, S/o. Kolpo, aged 35 years, Track man, Railway Employee, PF / NPS No. IG 120683, Railway Quarters, Quarter No. 452 / KL, near Goods Gate, Rajahmundry

...Respondent/ Defendant

పై నెంబరు దావాలో దివి. 13-02-2024వ తేదీన దావా డిఫాల్ట్‌కు డిస్మిస్ చేస్తూ శ్రీ కోర్టు వారు పాస్ చేసిన ఉత్తర్వులను ఉపసంహరించుకొని దావా రిస్టోర్ చేయమని పిటిషనర్లు / వాదులు దాఖలు చేసిన పిటిషను సమన్లు పై రెస్పాండెంట్ తీసుకొనకుండా తప్పించుకొనుచున్నారు. కావున **దివి. 08-5-2025వ తేదీ ఉదయం 10 గం॥ 30 ని॥లకు** శ్రీ కోర్టు వారి ఎదుట రెస్పాండెంట్ వ్యక్తిగతంగా గాని, ప్లీడరు గారి ద్వారా గాని హాజరు కావలెను. అట్లు కానిచో పరోక్షము నందు కేసు నిర్ణయింపబడును. శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం వేసిన బహిరంగ ప్రకటన.

జి.డి.ప్రసన్నకుమార్
అడ్వకేట్, Roll No: AP 347/1988
పిఠాపురం, సెల్: 9395389211